క్లుప్తంగా

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి



పోలంపల్లి(వత్సవాయి): భారీవర్షాలకు పోలంపల్లి వద్ద మునేటిపై ఉన్న చెక్‌డ్యాంకు పడిన గండిని వెంటనే పూడ్చాలని రైతు, కౌలురైతు సంఘం జిల్లా నాయకుడు చిరుమామిళ్ల హనుమంతరావు డిమాండ్ చేశారు. మునేటికి పడిన గండిని రైతుసంఘం నాయకులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గండిని పూడ్చకపోతే రైతులకు సాగునీటి ఇబ్బందులు తప్పవన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు పంటనష్టపరిహారం అందజేయాలని కోరారు. గండిని పరిశీలించినవారిలో రైతుసంఘ మండల కార్యదర్శి టి. రాంబాబు, కౌలుసంఘ కార్యదర్శి టి.రమేష్, కె.జాన్‌కోటయ్య, సీఐటీయూ మండల కార్యదర్శి బి.రాము, కాటేపల్లి వెంకటేశ్వర్లు, జయరాజు కోటేశ్వరరావు, వెంకటరత్నం ఉన్నారు.

నూతన పైపులైన్ ఏర్పాటు



కంచికచర్ల : ఇటీవల సంభవించిన వరదలకు కీసర మునేరు ఒడ్డున ఉన్న గండేపల్లి రక్షిత మంచినీటి పథకం పైపులైన్ కొట్టుకుపోయింది. దీంతో నూతన పైపులైన్ ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పైపులైన్ పనులను గండేపల్లి సర్పంచి బొక్కా రవికుమార్, కార్యదర్శి జె.రత్నాకర్ పర్యవేక్షించారు. సర్పంచి రవికుమార్ మాట్లాడుతూ మంచినీటి పథకం విద్యుత్ మోటార్ కూడా నీటమునగడంతో మరమ్మతు పనులు చేపట్టామన్నారు. పైపులైన్ పనులను త్వరితగతిన పూర్తిచేసి, మరో రెండురోజుల్లో గ్రామస్తులకు మంచినీరు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

పశుగ్రాసం పంపిణీ

జగ్గయ్యపేట అర్బన్: వరదల కారణంగా పశువులకు పశుగ్రాసం లేక ఇబ్బందిపడుతున్న నేపథ్యంలో జగ్గయ్యపేట నియోజకవర్గంలోని పశువులకు శుక్రవారం ఉచితంగా పశుగ్రాసం, సమీకృత దాణాను పంపిణీ చేశారు.స్థానిక పశువైద్యశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) పాల్గొని పశుపోషకులకు సమీకృతదాణాను పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు కట్టా నరసింహారావు, పట్టణ ప్రధానకార్యదర్శి మైనేని రాధా, సర్పంచుల సంఘం అధ్యక్షుడు ముల్లంగి రామకృష్ణారెడ్డి, పశువైద్యశాల ఏడీ భవానీప్రసాద్, పశువైద్యులు శ్రీను నాయక్, లక్ష్మీప్రసన్న, ఠాగూర్ పాల్గొన్నారు.

హెడ్ వాటర్‌వర్క్స్ పరిశీలన



జగ్గయ్యపేట అర్బన్: వరద ముంపునకు గురైన హెడ్‌వాటర్ వర్క్స్‌లో త్వరితగతిన మరమ్మతులు చేపట్టి జగ్గయ్యపేట ప్రజలకు పూర్తిస్థాయిలో మంచినీటిని అందించాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర,తో కలిసి శుక్రవారం ఆయన హెడ్‌వాటర్ వర్క్స్‌ను సందర్శించారు. పాడైపోయిన పైపులైన్, మోటార్లు, ఇతర సామాగ్రిని పరిశీలించారు. త్వరితగతిన మరమ్మతులు పూర్తిచేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు, మున్సిపల్ డీఈఈ శివకోటేశ్వరరావు, ఏఈ హనుమంతరావు, మైనేని రాధా, జిల్లా కార్యదర్శి గట్టిడి దుర్గాప్రసాద్ ఉన్నారు.


నిత్యావసరాల పంపిణీ



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో వరద ముంపునకు గురైన బాధితులకు రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ జగ్గయ్యపేట శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యావసర సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక భారతి సేవాసదన్(నీలిశెట్టి సత్యనారాయణ ఫంక్షన్ హాల్)లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వయం సేవకుల సహాయంతో 130కుటుంబాలకు సరుకులు పంపిణీ చేశారు. బీజేపీ సీనియర్ నాయకుడు కీసర రాంబాబు, హిందూ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పిన్నం వెంగళరావు, నరేంద్ర పాల్గొన్నారు.

బాధితులకు చేయూత

నందిగామ టౌన్:విజయవాడలోని వరద బాధితుల కోసం కాకతీయ అపోలో విద్యాసంస్థలు నిర్వాహకులు రూ.1.50లక్షల విలువగల నిత్యావసరాలను వితరణ చేశారు. ఈ మేరకు నిత్యావసరాలతో కూడిన వాహనాన్ని శుక్రవారం నందిగామ నుంచి విజయవాడ తరలించారు. అపోలో విద్యా సంస్థల నిర్వాహకుడు కాపా రవీంద్రబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.



వరద ఉధృతికి లింగాల వద్ద కొట్టుకుపోయిన కాజ్‌వే



జగ్గయ్యపేట-ముక్త్యాల రోడ్డులో పాలేటిపై దెబ్బతిన్న వంతెన



బలుసుపాడు-అన్నవరం రోడ్డులో దెబ్బతిన్న వంతెన



కోతకు గురైన కంచికచర్ల-ఎస్.అమరవరం రోడ్డు



గుమ్మడిదుర్రు వద్ద కుంగిన కల్వర్టు



జగ్గయ్యపేట బైపాస్‌లో కోతకు గురైన రోడ్డు



వరద ఉధృతికి ఛిద్రమైన పెనుగంచిప్రోలు-రేగులగడ్డ రోడ్డు

ఛిద్రమైన రోడ్లు

భారీవర్షాల కారణంగా వరద పోటెత్తడంతో జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో పలురోడ్లు కోతకు గురయ్యాయి. వరద ఉధృతికి వాగులు, వంకలు పొంగి పొర్లడంతో రోడ్లు దెబ్బతినగా, కాజ్‌వేలు, చప్టాలు, వంతెనలు కొట్టుకుపోయాయి. అప్రోచ్‌రోడ్లు నామ రూపాలు లేకుండా పోయాయి. దీంతో పలు గ్రామాలకు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముచ్చింతాల వద్ద కిలోమీటరు మేర రోడ్డు కొట్టుకుపోవడంతో పెనుగంచిప్రోలు నుంచి ముచ్చింతాల, వత్సవాయి మండలం తాళ్లూరు నుంచి తెలంగాణకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అనిగండ్లపాడు-గుమ్మడిదుర్రు రోడ్డులో వాగు కల్వర్టు పూర్తిగా కుంగిపోగా ఈ గ్రామాలతోపాటు నందిగామ మండలానికి పూర్తిగా సంబంధాలు నిలిచిపోయాయి. శనగపాడు వద్ద గండివాగు కల్వర్టుపై చప్టా కొట్టుకుపోవటంతో సుబ్బాయిగూడెం, కొళ్లికూళ్ల, వెంకటాపురం, వెంగనాయకునిపాలెం, శనగపాడు గ్రామాల నుంచి నందిగామ, విజయవాడకు వెళ్లేందుకు వీరంతా 15కిలోమీటర్లు అదనంగా ప్రయాణించి పెనుగంచిప్రోలు మీదుగా వెళ్లకతప్పడం లేదు. వత్సవాయి మండలంలో లింగాల వద్ద మునేరు కాజ్‌వే పూర్తిగా దెబ్బతినడంతో లింగాల నుంచి చిట్యాల, మక్కపేట, పోలంపల్లి, డబ్బాకుపల్లి, పెంటాలవారిగూడెం, పోచవరం, వత్సవాయి, వేములనర్వ, కాకరవాయి, మాచినేనిపాలెం, తాళ్లూరు, కంభంపాడు, వేమవరం, ఆళ్లూరుపాడు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. జగ్గయ్యపేట మండలంలోని బలుసుపాడు నుంచి అన్నవరం వెళ్లే రోడ్డు కొట్టుకుపోవడంతో నేటికీ రాకపోకలు ప్రారంభం కాలేదు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ రోడ్లు 30 కిలోమీటర్లు ధ్వంసం కాగా, వంతెనలు కొట్టుకుపోవడంతో రూ.8కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు డీఈ పరుశురాములు తెలిపారు. కంచికచర్ల మండలంలోని బత్తినపాడు-చెవిటికల్లు వెళ్లే ఆర్‌అండ్‌బీరోడ్డు వరద ఉధృతికి కొట్టుకుపోగా, కునికెనపాడు-చెవిటికల్లు వెళ్లే రోడ్డుపై గోతులుపడ్డాయి. నందిగామ నియోజకవర్గంలో మొత్తం 77కిలోమీటర్ల మేర రోడ్లు ధ్వంసం కాగా, మూడు కల్వర్టులు, నాలుగు బ్రిడ్జిలు దెబ్బతిన్నాయి. దీంతో నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీశాఖకు రూ.6.30కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. రోడ్లు, కాజ్‌వేలు దెబ్బతినడంతో రాకపోకలకు వీలులేక ఆరురోజులుగా ఆయా గ్రామాల ప్రజలు అవస్థలుపడుతున్నారు.

–జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, నందిగామటౌన్, కంచికచర్ల, వత్సవాయి, వీరులపాడు



అధ్వానంగా మారిన కునికెనపాడు రోడ్డు



వరద ఉధృతికి దెబ్బతిన్న చెవిటికల్లు-గనిఆత్కూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు



వీరులపాడు మండలం పల్లంపల్లి వద్ద ధ్వంసమైన రోడ్డు



వరదకు పెనుగంచిప్రోలు-ముచ్చింతాల రోడ్డు కొట్టుకుపోవడంతో పొలాల్లో నుంచి వెళ్తున్న రైతు

మట్టి వినాయక ప్రతిమలు వినియోగించాలి

నందిగామ టౌన్: అందరూ పర్యావరణ హితమైన మట్టివినాయక ప్రతిమలను వినియోగించాలని నందిగామ మున్సిపల్ కమిషనర్ రమణబాబు కోరారు. పట్టణంలోని గాంధీ సెంటరులో పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు రామిరెడ్డి శ్రీధర్ అందించిన మట్టి వినాయక ప్రతిమలను సీఐ వైవిఎల్ నాయుడుతో కలిసి శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ 24ఏళ్లుగా శ్రీధర్ మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తుండటం అభినందనీయమని కొనియాడారు. సీఐ నాయుడు మాట్లాడుతూ పందిళ్ల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని నిర్వాహకులకు సూచించారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: వినాయక చవితిని పురస్కరించుకుని కోదాడ రోడ్డులో కిరాణా వ్యాపారి కల్వకుంట్ల జనార్దనరావు స్థానికులకు ఉచితంగా వినాయకుని మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. పర్యావరణ హితం కోసం మూడేళ్లుగా మట్టివిగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు ఆయన వివరించారు.



నందిగామలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న కమిషనర్ రమణబాబు

ఉచిత సర్వీస్ క్యాంపు ప్రారంభం

జగ్గయ్యపేట అర్బన్: వరద కారణంగా ముంపునకు గురైన ఇళ్లలోని గ్యాస్ స్టవ్‌లకు ఉచితంగా సర్వీసు చేసేందుకు స్థానిక అన్నపూర్ణ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ క్యాంపును ఎమ్మెల్యే రాజగోపాల్ శుక్రవారం ప్రారంభించారు. క్యాంపు నిర్వాహకులైన స్థానిక హెచ్‌పీ గ్యాస్ డీలర్, ఏపీ ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అప్పన రామ్‌కుమార్‌ను అభినందించారు. టీడీపీ నాయకులు, గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

పొంగిన పంట చెరువు



తడిసిన దుస్తులు, సామగ్రితో బాధితురాలు సంధ్యారాణి



తడిసిన ధాన్యం, ఇతర సామగ్రిని ఇంటిబయట ఆరబెడుతున్న మిఖేల్ కుటుంబసభ్యులు

నీటమునిగిన ఇళ్లలోని వస్తువులు

ముచ్చింతాల(పెనుగంచిప్రోలు): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ఫలితంగా రెండురోజులుగా కురుస్తున్న వర్షాలు ముచ్చింతాల గ్రామంలో తీరని నష్టాన్ని మిగిల్చింది. ముఖ్యంగా ఎస్సీకాలనీ పక్కన ఉన్న పంట చెరువు పొంగడంతోపాటు గండ్లుపడటంతో పలు ఇళ్లలోకి నీరుచేరింది. దీంతో ఇళ్లలోని నిత్యావసర సరుకులు, దుస్తులు, ఎలక్ట్రికల్ వస్తువులు, వంట సామగ్రి, విద్యార్థుల పుస్తకాలు, ఇతర వస్తువులు నీటిలో మునిగిపోయాయి. కొన్ని వస్తువులు వరదకు కొట్టుకుపోయాయి. ఇళ్లల్లో ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. తమకు తక్షణం న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

వినాయకచవితి సందడి

జగ్గయ్యపేట అర్బన్: వినాయకచవితి పండుగను పురస్కరించుకుని జగ్గయ్యపేట పట్టణంలో సందడి నెలకొంది. వినాయకుడి ప్రతిమలు, పత్రి కొనుగోలుదారులతో ప్రధాన వీధులు కిటకిటలాడుతున్నాయి. స్థానిక రైతుబజార్ మార్కెట్ ఎదురుగా వ్యాపారులు తోపుడుబండ్లపై పాలవెల్లి, పత్రి కాయలు, ఎలక్కాయలు, మారేడు పండ్లు, కలువ పూలు, జిల్లేడు, ఉమ్మెత్త కాయలు, నారింజ, దబ్బకాయలు, బంతిపూలు, మామిడి, అరటి ఆకులను తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. పెద్దసంఖ్యలో ప్రజలు పూజాసామగ్రి కొనుగోలు చేశారు. పట్టణంలోని ఆయా వీధుల్లో వినాయకుడి పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు.

కంచికచర్ల మండలంలో...

కంచికచర్ల: వినాయక చవితి పర్వదినం పురస్కరించుకుని నందిగామ నియోజకవర్గంలో నవరాత్రి ఉత్సవ మండపాలు ఏర్పాటు చేస్తున్నారు. అందమైన రంగురంగుల వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. మండపాలను అందంగా తీర్చిదిద్దారు.

కంచికచర్ల మండల పరిధిలో ఏర్పాటు చేస్తున్న వినాయక మండపాల వద్ద భక్తులంతా క్రమశిక్షణతో ఉండాలని కంచికచర్ల ఎస్‌ఐ బోనగిరి రాజు సూచించారు. పోలీసుశాఖ సూచనలను తప్పకుండా పాటించాలన్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ ఆదేశించారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి :వినాయక నవరాత్రులకు గ్రామాల్లో మండపాలు ముస్తాబవుతున్నాయి. వినాయక ప్రతిమను ఉంచి తొమ్మిది రోజులపాటు ఘనంగా పూజాకార్యక్రమాలను నిర్వహించుకునేందుకు భక్తులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. నిమజ్జనాల సందర్భంగా డీజేలు ఏర్పాటు చేసుకునే వారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్‌ఐ పి.ఉమామహేశ్వరరావు సూచించారు.



వినాయకుడి బొమ్మల కొనుగోలుదారులతో సందడిగా ఉన్న జగ్గయ్యపేటలోని ప్రధాన వీధి



కంచికచర్లలో అందంగా తీర్చిదిద్దిన వినాయక మండపం



అయ్యప్పనగర్‌లో గణేష్ విగ్రహానికి ఆహ్వానం పలుకుతున్న మహిళలు

వీడని వర్షాలు–జలమయమైన గ్రామాలు

కంచికచర్ల : నందిగామ డివిజన్‌లో శుక్రవారం కురిసిన కుండపోత వర్షానికి గ్రామాలన్నీ జలమయమయ్యాయి. పంట చేలల్లో వర్షపునీరు నిలబడి ఉంది. రోడ్లపై నీరు పారుతుండటంతో ఎక్కడ గోతులున్నాయో తెలియక వాహనదారులు బిక్కు బిక్కుమంటూ ప్రయాణం సాగిస్తున్నారు. నందిగామ డివిజన్‌లో 40.0శాతం వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. కంచికచర్లలో 13.4ఎంఎం, నందిగామలో 18.4, వీరులపాడులో 4.2. జగ్గయ్యపేటలో 1.2, వత్సవాయిలో 2.8 వర్షపాతం నమోదైనట్లు వివరించారు. వరద ఉధృతికి ఇప్పటికే పంటచేలన్నీ నీటిలోనే నానుతుండగా, శుక్రవారం వర్షం పడటంతో ఇక పంటలు దక్కేలా లేవని కీసరకు చెందిన కౌలురైతు షేక్ శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తంచేశారు. పంటనష్టపరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఆందోళన రైతులు..

నందిగామ టౌన్: నిన్నమొన్నటి వరకు భారీవర్షాలు, వరదల కారణంగా ఇబ్బందులు పడిన ప్రజలు వరద ఉధృతి తగ్గిందని ఒకింత ఊపిరి పీల్చుకుంటుగా.. శుక్రవారం కురిసిన భారీవర్షంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ వర్షంతో పంటలు నీటమునిగాయి. నందిగామ పట్టణంలో ముంపు ప్రాంత ప్రజలను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించి వసతులు కల్పిస్తున్నారు.

మరమ్మతులు చేయండి..మహాప్రభో!

కంచికచర్ల : నందిగామ డివిజన్‌లో వరద ఉధృతికి రోడ్లు దెబ్బతినడంతో ఆయా గ్రామాల ప్రజలు అవస్థలుపడుతున్నారు. వాగులు, వంకలు పొంగి రోడ్లపైకి ప్రవహించడంతో వరద ఉధృతికి కొన్నిచోట్ల రోడ్లకు పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. కంచికచర్ల నుంచి ఎస్.అమరవరం వెళ్లే రోడ్డు గోతులమయం కాగా, గనిఆత్కూరు నుంచి చెవిటికల్లు వెళ్లే రోడ్డుపై పరిస్థితి అధ్వానంగా మారింది. మోగులూరు నుంచి మున్నలూరు వెళ్లే రోడ్డుపై పెద్దపెద్ద రాళ్లు పైకిలేచాయి. కొన్నిచోట్ల రోడ్లు భారీగా కోతకు గురయ్యాయి. భారీ వర్షాలు, వరద ఉధృతికి మండలంలోని రోడ్లు ఇలా ఛిద్రం కావడంతో వాహనచోదకులు, ప్రయాణికులు పడుతున్న అవస్థలు ఇన్నీకావు. ఈ రోడ్లలో ప్రయాణం చేయలేక ప్రజలు పడుతున్న బాధలు వర్ణనాతీతం, ఇకనైనా పాలకులు, ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ఆయా రోడ్లకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.



అధ్వానంగా మారిన మోగులూరు నుంచి మున్నలూరు వెళ్లే రోడ్డు

•ప్రజలకు శుభాకాంక్షలు

జగ్గయ్యపేట అర్బన్, నందిగామటౌన్: వినాయకచవితి పర్వదిన సందర్భంగా జగ్గయ్యపేట, నందిగామ మాజీఎమ్మెల్యేలు సామినేని ఉదయభాను, డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.